## క్లుప్తంగా

### విద్యార్థులకు అభ్యసనా సామగ్రి వితరణ



అభ్యసనా సామగ్రి అందిస్తున్న దాతలు

నగరి: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (బాలికలు)లో పూజ, రిత్విసత్రీ అనే దాతలు అభ్యసనా సామగ్రిని వితరణగా అందించారు. సోమవారం పాఠశాలకు వెళ్లిన వారు హెచ్ఎం సురేష్ చేతుల మీదుగా విద్యార్థులకు పలకలు, నోట్‌బుక్స్, బ్యాగ్‌లు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మీనా, విద్యార్థుల తల్లిదండ్రులు గుణశేఖర్, జ్యోతినాయుడు, చిట్టి, రాజశేఖర్, ఎల్‌కే రాజ పాల్గొన్నారు.

### రాణెమ్మ కుటుంబానికి పరామర్శ



రాణెమ్మ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని తిప్పినాయుడుపల్లె సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి తల్లి రాణెమ్మ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పరామర్శించారు. సోమవారం ఆయన గ్రామానికి వెళ్లి రాణెమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### దొరస్వామిరాజుకు నివాళి



దొరస్వామిరాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

గంగాధరనెల్లూరు: గంగాధర నెల్లూరు మండలంలోని ఉమ్మడివింజం బాలగంగనపల్లి మాజీ సర్పంచ్ దొరస్వామిరాజుకు స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. సోమవారం బాలగంగానపల్లిలోని జరిగిన దొరస్వామిరాజు కర్మక్రియల సందర్భంగా పార్టీలకు అతీతంగా స్థానిక నాయకులు దొరస్వామిరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆనగంటి హరికృష్ణ, గుణశేఖర్ రెడ్డి, వేల్కూరు బాబురెడ్డి, వెంకట్ రెడ్డి, వింజం సర్పంచ్ గోవిందన్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, భానుచంద్రారెడ్డి, యువరాజ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

### మందుబాబుకు జరిమానా



నిందితుడిని కోర్టుకు తీసుకెళ్తున్న కానిస్టేబుల్

నగరి: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ముద్దాయికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ నగరి జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.విష్ణువర్మ సోమవారం తీర్పు ఇచ్చారు. సీఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. నింద్ర మండలం ఆలపాకం దళితవాడకు చెందిన ఇ.గుణశేఖర్ మద్యం సేవించి వాహనం నడుపుతుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఆ కేసును విచారించిన జడ్జి విష్ణువర్మ ముద్దాయికి రూ.10 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో నిందితుడికి జైలు శిక్ష విధించడం జరుగుతుందని కోర్టు సిబ్బంది తెలిపారు.

### విద్యా ఉపకరణాల అందజేత



విద్యా ఉపకరణాలు అందిస్తున్న దాత

విజయపురం: మండలంలోని కేవీపురం పాఠశాల విద్యార్థులకు దాతలు భాస్కర రాజు, ఢిల్లీ వర్మ, సుధీర్ వర్మ నోటు పుస్తకాలు, పెన్సిల్, పెన్నులు, క్రయాన్ మొదలగు విద్య ఉపకరణాలు అందించారు. సోమవారం పాఠశాలకు వెళ్లిన దాతలు ప్రధానోపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు విద్యా ఉపకరణాలను అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత ఉపాధ్యాయులు చంద్రయ్య పాల్గొన్నారు.

# స్వర్ణవర్ణ శోభితం



గరుడ గిరిపై బంగారు వర్ణంతో అస్తమిస్తున్న సూర్యుడు



తిరునగరిని కమ్ముకున్న కారుమబ్బులు

ఆధ్యాత్మిక నగరిలో సోమవారం ఆకాశదేశాన వింత మార్పులు చోటు చేసుకున్నాయి. ఓవైపు నల్ల మబ్బులతో వర్షం కురుస్తుంటే మరోవైపు సాయం సంధ్య వేళ అస్తమిస్తున్న భానుడు గరుడ గిరిపై బంగారు వర్ణంలో శోభించాడు. ఈ అరుదైన దృశ్యాలను చూపరులు తమ సెల్ ఫోన్లలో చిత్రీకరించుకున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్ , తిరుపతి

## మధ్యాహ్న భోజన కార్మికులపై ఒత్తిళ్లు సరికాదు



ఎంఈఓకు వినతి పత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నగరి: నగరి మున్సిపల్, రూరల్ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలో వంట చేసే కార్మికులను మార్చాలంటూ రాజకీయ ఒత్తిళ్లు చేయడాన్ని ఆపాలంటూ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ నాయకులు బాషా ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులతో పాటు ఎమ్మార్సీకి వెళ్లిన ఆయన ఎంఈఓ శ్రీదేవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో వచ్చిన వెంటనే ప్రభుత్వ పాఠశాలలో వంట చేసే కార్మికులను మార్చాలని కొందరు రాజకీయ నాయకులు కొన్ని ప్రాంతాల్లో ఒత్తిడి తీసుకురావడాన్ని ఏటీయూసీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కార్మికుల జోలికి వెళ్లొద్దని ప్రభుత్వ పెద్దలు, స్థానిక ఎమ్మెల్యేలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న పార్టీ శ్రేణులకు హితవు పలకాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు, ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించి వారిని ఆదుకునే విధంగా స్థానిక అధికారులకు సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ నాయకులు వేలన్,శేఖర్, చిరావుద్దీన్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు దాతల సాయం మరువలేనిది



అభ్యసనా సామగ్రి అందజేస్తున్న మోహన్‌మురళి

వెదురుకుప్పం: మండలంలోని అగ్గిచేనుపల్లె ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు స్కూల్ కమిటీ చైర్మన్ శివకుమార్ సహకారంతో అభ్యసనా సామగ్రి అందజేశారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో పిల్లలకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, పలకలు, ప్యాడ్లు, బాక్సులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌మురళి మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి శివకుమార్ తోడ్పాటు అందించడం అభినందనీయమన్నారు. దాతలు అందించే సహకారంతో పేదపిల్లలు ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మండల విద్యాశాఖ అధికారి మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సహకారంతో పాటు దాతల సేవలను సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు అభ్యసించాలని సూచించారు. అనంతరం దాత శివకుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ దామోదరం, హెచ్ఎం అక్బర్, ఉపాధ్యాయుడు రవి, అగన్‌వాడీ కార్యకర్త ప్రేమలత, సీఆర్పీలు షణ్ముగం, విక్కీ, నాయకులు వరప్రసాద్, కార్తీక్ జయంత్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

విజయపురం: పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీఓ బ్రహ్మయ్య అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలకు డయేరియా వ్యాధిని అరికట్టడం, పారిశుద్ధ్య నిర్వహణ అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలువలు శుభ్రపరచాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రపరచి క్లోరినేషన్ చేయాలని సూచించారు. నీటి సరఫరా విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

## కమనీయం.. ద్రౌపదీదేవి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట గ్రామంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగాంగా సోమవారం సాయంత్రం అమ్మవారి కల్యాణం కనులవిందుగా జరిగింది. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి స్వర్ణలతచే హరికథా కాలక్షేపం జరిగింది. సాయంత్రం ఆలయం ఆవరణలో పెళ్లిపందిరి ఏర్పాటు చేసి ఉత్సవమూర్తులను వేంచేపు చేశారు. పట్టుపీతాంబరాలు, సుగంధ పరిమళాలతో ముస్తాబు చేశారు. సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా మాంగళ్యధారణ చేశారు. చుటుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారిని నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

## నీట్ స్కామ్‌పై విచారణ చేపట్టాలి



దండి మార్చ్ సర్కిల్ వద్ద పీడీఎస్ఓ నేతల నిరసన

తిరుపతి సిటీ: నీట్ పరీక్ష పేపర్ లీకేజీ స్కామ్‌పై తక్షణం సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరపాలని పీడీఎస్ఓ విద్యార్థి సంఘం తిరుపతి జిల్లా కార్యదర్శి ఆర్ ఉష డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎమ్మార్ పల్లి దండి మార్చ్ సర్కిల్ వద్ద పీడీఎస్ఓ ఆధ్వర్యంలో నీట్ పరీక్ష రాసిన విద్యార్థులతో కలసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బిహార్, గుజరాత్ రాష్ట్రాలలో జరిగిన నీట్ స్కామ్‌పై ప్రధాని నోరు మెదపకపోవడం దారుణమన్నారు. 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలు రోడ్డు పాలు చేయడం ఎంతవరకు న్యాయమని నిలదీశారు. ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని, తిరిగి నీట్ పరీక్షను వెంటనే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలనానరు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పీడీఎస్ఓ నాయకులు త్రివేణి, సుచిత్ర, పెద్ద సంఖ్యలో నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు పాల్గొన్నారు.

## టీడీపీ నేతల వేధింపులతో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

విజయపురం: టీడీపీ నాయకుల వేధింపులు తాళలేక విజయపురం మండలంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ సోమవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విజయపురం మండలం, కాళికాపురం పంచాతీకి చెందిన రమేష్ గత 15 సంవత్సరాలుగా ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి ఒక భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తన పంచాయతీలో ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించడంతో మంచి పేరు ఉంది. అయితే ఇటీవల టీడీపీ మండల, స్థానిక నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్ పదవికి రాజీనామా చేయాలని రమేష్‌ను వేధించడం ప్రారంభించారు.

రోజురోజుకూ వేధింపులు ఎక్కువ కావడంతో సోమవారం పొలానికి తీసుకొచ్చిన పురుగు మందు తాగి ఆత్యహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు విషయం తెలుసుకుని వెంటనే నగరిలో ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్లు చికిత్స అందిస్తున్నారు.

# పీఎస్-4లో మరోమారు తనిఖీలు



పీఎస్-4 హోటల్‌లో తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ, ప్రజారోగ్య అధికారులు

తిరుపతి తుడా: ప్రముఖ పీఎస్-4 హోటల్లో యాత్రికులకు వడ్డించిన ఆహారంలో విషపు జెర్రి వెలుగు చూసిన ఉదంతం సంచలనం సృష్టించింది. దీనిపై ఫిర్యాదులు అందడం, ఫిర్యాదిదారులు, ఘటనను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియాపై దౌర్జన్యానికి దిగిన పీఎస్ 4 హోటల్‌పై మున్సిపల్ కార్పొరేషన్ ప్రజా ఆరోగ్య విభాగం కఠినమైన చర్యలకు దిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పీఎస్-4 హోటల్‌కు రూ.50 వేల భారీ జరిమానా విధించింది. గడిచిన నాలుగు రోజులుగా రెస్టారెంట్‌ను సీజ్ చేశారు. ఈ క్రమంలో తమ ఇకపై ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తామని యాత్రికులకు నాణ్యమైన వంటకాలు అందిస్తామని హామీ ఇవ్వడంతో పీఎస్-4ను తెరిచేందుకు సోమవారం అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో మరోమారు కిచెన్ పరిసర ప్రాంతాలు, వంటలకు ఉపయోగించే పదార్థాలు, కూరగాయల నాణ్యతను తనిఖీ చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ హోటళ్లలో నాణ్యమైన వంటకాలను అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇకపై నాణ్యమైన వంటలను అందిస్తామని హామీ ఇవ్వడంతో కమిషనర్ ఆదేశాల మేరకు పీఎస్-4ను తెరిచేందుకు అనుమతులు ఇచ్చామన్నారు. నాణ్యమైన వంట సామగ్రి, కూరగాయలను మాత్రమే వినియోగించాలని ఆయన సూచించారు. పీఎస్-4లో రెండు రోజులకు ఒక మారు పెస్ట్ కంట్రోల్ చర్యలు చేపట్టాలని, గోడలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, కిచెన్‌లో మూతలు కలిగిన పాత్రలు వాడాలని సూచించామని అన్నారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మద్దిలేటి, శానిటరీ సూపర్‌వైజర్స్ చెంచయ్య, సుమతి తనిఖీల్లో పాల్గొన్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామనాథరెడ్డి

పాలసముద్రం: మండల పరిధిలోని గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యానికి హాని కలగదని ఎంపీడీఓ రామనాథరెడ్డి, తహసీల్దార్ సుబ్బలక్ష్మి తెలిపారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులకు ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది వారికి కేటాయించి గ్రామాలకు వెళ్లి వాతావరణం మార్పు వల్ల వచ్చే వ్యాధులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాల్లో వర్షపునీరు నిల్వలేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తాగునీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని సూచించారు. మల విసర్జన తరువాత ఆహారం తినే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. వీరేచనాలు ఎక్కువగా అయితే వెంటనే ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలని సూచించారు. ఐదేళ్ల వయసున్న పిల్లల్లో డయేరియా లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యపరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

## బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ

పాలసముద్రం: మండల పరిధిలోని బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ తెలిపారు. సోమవారం ఆముదాల ప్రాథమికోన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమం జరిగింది. ఎంఈఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చదవడానికి మౌలిక వసతులు, నాణ్య విద్యను అందిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని తెలిపారు. అనంతరం గ్రామాల్లో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు.

## నేడు కలప వేలం

పుత్తూరు: మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు కలపను బహిరంగ వేలం వేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిథిలావస్థలో ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయాన్ని తొలగించిన నేపథ్యంలో సేకరించిన పాత కలపను వేలం వేయనున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనదల్చిన వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని స్పష్టం చేశారు. వేలం అనంతరం డిపాజిట్ మొత్తం తిరిగి చెల్లించబడుతుందన్నారు. హెచ్చుపాటదారుడు 18 శాతం అమ్మకం పన్నుతో సహా మొత్తం నగదులో 25 శాతం నగదును వెంటనే చెల్లించి రశీదు పొందాలని వివరించారు. మిగిలిన మొత్తాన్ని మూడు రోజుల వ్యవధిలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. రెవెన్యూ, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారుల సమక్షంలో వేలం జరుగుతుందని తెలిపారు.

## కూలీలకు వంద రోజులు పని కల్పించాలి



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

శ్రీరంగరాజపురం: ప్రతి కుటుంబానికీ వంద రోజులు పని దినాలు కల్పించాలని ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌లకు మండల ఉపాధి హామీ ఏపీఓ చంద్రశేఖర్ సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ పురం గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనుల్లో భాగంగా ఫారంపాండ్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి మీ గ్రామంలోని వంద రోజులు పని కల్పించడం జరుగుతుందన్నారు. ఒకరోజు ఒక కూలికి గరిష్టంగా రూ.300 చెల్లించడం జరుగుతుందన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా రైతులు తమ పొలంలో మామిడి, టెంకాయ చెట్లు, ఏవైనా పండ్ల తోటలు పెట్టుకోవడానికి అవకాశాలు ఉన్నాయని వీరికి మూడేళ్లకు నీరు, ఎరువు బిల్లు, కూడా చెల్లించడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఉపాధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీరితో పాటు జూనియర్ అసిస్టెంట్ జ్యోతి, టెక్నికల్ అసిస్టెంట్ బాల, రేఖ, నోమేశ్వరి, తదితరులు ఉన్నారు.

## కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వర స్వామి ఆలయంలో భక్తి ప్రపత్తులతో అభిషేకాలు, విశేష పూజలు చేశారు.

## మెరిట్ విద్యార్థులకు బహుమతి పంపిణీ



పాఠశాల ఉపాధ్యాయులకు బీరువాను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1982- 83 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు 2024 విద్యా సంవత్సరం 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు నగదు ప్రోత్సాహంతో పాటు పాఠశాల అవసరాల నిమిత్తం ఒక బీరువాను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఇకపై ప్రతి విద్యా సంవత్సరం మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులు చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు లోకనాథరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జయచంద్ర నాయుడు, చంద్రన్, మధుసూదన్, వాసు, అరుల్ దాస్, సురేఖ, తులసి, తదితరులు పాల్గొన్నారు.